

# చిక్కులు

మనోప్రియ

**సికిందరాబాద్‌లోని మోండా మార్కెట్టుకు వెళ్లి కూరగాయలు కొనుక్కోడానికి భయం అని కాదు కాని ఆండాళ్లు ఎక్కడ కనబడుతుందేమోనని అనిపిస్తుంది. ఆమెను చూసింది ఒక్కసారే. అయినా ఇప్పటికీ నాకు ఆమె ముఖం బాగా గుర్తు ఉంది. ఆమెకు ముప్పయి అయిదు సంవత్సరాలకన్నా ఎక్కువ వయసు ఉండదు. అంత లావూ కాదు; సన్నమూ కాదు. చామనచాయ కాదు. నలుపు అయినా చక్కగా ఉంటుంది. పెద్దబుట్ట నిండా వంకాయలు ముందుపెట్టుకుని మెట్లమీద కూర్చుని ఉంటుంది. ఈ సంఘటన జరిగి ఆరు నెలలు పయిగా అయినా ఆమె రోజుకు నాకు ఒకసారయినా గుర్తు వస్తుంటుంది.**

మార్కెట్టు ఉదయంపూట రద్దీగా ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆదివారాలయితే కాలు వేసి, తీయడానికి అయినా స్థలం ఉండదు. ఒక్క మనిషి కదలడానికే జాగా ఉంటుంది. మళ్లీ సాయంత్రాల పూట అంత ఉండదు. ఉదయంపూట వెళ్తే తాజా కూరగాయలు దొరుకుతాయి. ధర తక్కువగా ఉంటుంది. సాయంత్రం కూరగాయలు తాజాగా ఉండవు. ధర కొద్దిగా ఎక్కువగానే ఉంటుంది. ఒకసారి వెళ్తే రెండు వారాలకు సరిపడే కూరగాయలు తెచ్చుకుని ఫ్రిజ్‌లో పెట్టేసుకుంటాను.

ఆరోజు కూరగాయలు కొంటూ ఆండాళ్లు వంకాయల బండి ముందు ఆగి ముందు వంగి చూడసాగాను. వంకాయలు మంచిగా ఉన్నాయి. నాకు వంకాయకూరంటే ఇష్టం. వంకాయలతో ఇరవయి రకాలకు పైగా కూరలు చేయొచ్చు. నాకు పెళ్లి

**కథ**

కాలేదు కాని వంటల్లో మంచి నేర్పు ఉంది. పెద్ద ఎత్తునేం చేయలేను కాని నా వంటకాలతో చుట్టుపక్కల మగాళ్లను ఆకర్షించడంవలన పక్కింటి ఆడవాళ్లు నా వంక కోపంగా చూస్తుంటారు. నేనేం పట్టించుకోను.

మార్కెట్టులో మనుషులెంత రద్దీగా కదులుతుంటారో ఆవులూ, ఎద్దులు మనుషులను రాసుకుంటూ వెళ్లిపోతుంటాయి. ట్రాఫిక్ పోలీసులా ఎంత గదిమినా మాట వినవు. వాటి మన్నాన వాటిని పోనిచ్చేస్తుంటారు. వంకాయల మీద దృష్టి పెట్టిన నేను నన్ను ఒరుసుకుంటూ వెళ్లిపోయిన ఎద్దు ధాటికి నిలబడలేక గరిమనాభి తప్పి ఆండాళ్లు ఒడిలో పడ్డాను. నేను ఏమాత్రం ఊహించని సంఘటన అది! తూలి పడడంలో నా కళ్లద్దాలు ఆమె ఒడిలో పడ్డాయి. వాటిని వెతుక్కుంటోంటే, వంకాయ ఉన్న చేత్తో నా తల మీద చిన్నగా కొడుతూ, "ఏమిటా పని? ఎవరయినా చూస్తే బావుండదు. లే" అంది. నిజానికి నాకు ఎటువంటి ఉద్దేశం లేదు. నా చేతికి వెంటనే కళ్లజోడు దొరకబట్టి అట్టే సమయం తీసుకోకుండా ఆమె మీంచి లేవగలిగాను. అవసరం లేకపోయినా వంకాయలు తీసుకున్నా అరకిలో ఎక్కువే కొలిచి కిలోకే డబ్బులు తీసుకుంది. మా పనిమనిషి నాకు పావుకిలో మటుకు ఉంచి మిగిలినవన్నీ తను తీసుకెళ్లింది. ఆమె గురించి కూడా చెబుతాను.

నాకు పుదీనా పచ్చడి అంటే చాలా ఇష్టం. పదీ, పదిహేనుసార్లు చేయడానికి ప్రయత్నించాను. కుదరలేదు. పనీ పాటా లేని వాడిని కాబట్టి వంట గురించి చెప్పే అన్ని టి.వి.వాళ్లను అడిగాను. ఒక్కొక్కరు ఒక్కో విధంగా చెప్పారు. నాకు పిచ్చెక్కిపోయి అనంతపురం జయిలుకు వెళ్లిపోదామనిపించింది. చివరి ప్రయత్నంగా భారతిని అడిగాను. ఆమెతో నాకు ఎక్కువ పరిచయం లేదు కాని వంటలు చేయడంలో చక్కటి అనుభవం ఉందని తెలిశాక నాకు తెలిసిన వాళ్లెవరో ఆమె ఫోను నెంబరు ఇస్తే నన్ను నేను పరిచయం చేసుకుంటూ నాకూ వంటా వార్పుల్లో అనుభవం ఉన్న సంగతి దాచిపెట్టి, పుదీనా పచ్చడి ఎలా చేయాలో చెప్పమని అడిగాను. ఆమె చాలా బిజీ వ్యక్తి అనుకుంటాను, "పచ్చళ్ల మీద ముచ్చట్లు అనే పుస్తకం రాశాను. మీ చిరునామా

**మా పనిమనిషి నా దగ్గర డబ్బులేం తీసుకోదు. అవసరమయినప్పుడు వందా, రెండొందలు తీసుకుంటుంది కాని అది పెదరావూరుఖాతే అనుకోవాలి. ఆమెను పనిమనిషి అంటే కోపం వస్తుంది. ఆమె నాకు పనిమనిషో, నేనామెకు పనిమనిషినో ఇంతవరకు నాకు అర్థంకాని విషయం. వారానికి కనీసం మూడు రోజులయినా దుమ్మా కొడ్తుంది. ఆమె దగ్గర కంపూట్యరు లిస్టు ఉందో, ఏమో ఒకసారి చెప్పిన కారణం మరోసారి చెప్పదు. జీతం అంటూ ఏమీ ఇవ్వను కాబట్టి అరిచే ప్రసక్తి లేదు.**

చెప్పండి. మీకు పంపిస్తాను" అంది. నా చిరునామా చెప్పాను. మూడు రోజుల తర్వాత వి.పి.పిలో పచ్చళ్ల పుస్తకం అందింది కాని అందులో పుదీనా పచ్చడి గురించి లేనేలేదు. పుస్తకంలో సగం పేజీలు గృహలక్ష్మి సంపాదకురాలి ముందుమాటలున్నాయి. ఆ మాటల్లో పొగడ్తకన్నా ఆ వంటలు చేసి భర్తలను నానా విధాలుగా ఏడిపించవచ్చని స్పష్టంగా చెప్పకపోయినా విడాకులు తీసుకోడానికి ఉపయోగపడుతుందని కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. మలకపేటలోని కుండల షాపులోని కుండలు బద్దలయిపోయి ఉండాలి. విడాకులు ఇప్పించే లాయర్లకు ఆ పుస్తకం ఎంతో ఉపయోగపడి ఉండొచ్చు. అది ఎనిమిదో ముద్రణ. అందులోనూ అయిదువేల కాపీలు. ఇంగ్లీషు నుండి తెలుగులోకి కాపీ చేసిన నవలల్లా, వ్యక్తిత్వ వికాసపు పుస్తకాల్లా బాగానే అమ్ముడయ్యాయి.

నా సమస్య మటుకు అలానే ఉండిపోయింది. విసుక్కుంటే విసుక్కోనీ అనుకుని భారతికి ఫోను చేసి ఆమె పుస్తకం గురించి పొగిడి పుదీనా పచ్చడి గురించి అడిగాను. మంచి మూడ్‌లోనే ఉంది. ఓపికగా పచ్చడి మన ఇష్టమయినవాళ్లకు ఎలా చేసిపెట్టాలో, ఇష్టం లేనివాళ్లకు ఎలా చేసిపెట్టాలో వివరంగా చెప్పింది. ఎలా చేయాలో నాకు అర్థం అయింది. చివర్లో "ఎన్ని నీళ్లు పోయాలి?" అడిగాను. "ఎక్కువ నీళ్ల వద్దు. పుక్కిడి చాలు" అంది. తనకు అలవాటయిన అతి మామూలు విషయంలా. పుదీనాపచ్చడి చేయడం ఇప్పటివరకు ప్రయత్నం చేయలేదు.

మా పనిమనిషి పేరు సునీత. నా వయసులో సగం వయసుంటుంది. నా దగ్గర డబ్బులేం తీసుకోదు. అవసరమయినప్పుడు వందా, రెండొందలు తీసుకుంటుంది కాని అది పెదరావూరు ఖాతే అనుకోవాలి. ఆమెను పనిమనిషి అంటే కోపం వస్తుంది. ఆమె నాకు పనిమనిషో, నేనామెకు పనిమనిషినో ఇంతవరకు నాకు అర్థంకాని విషయం. వారానికి కనీసం మూడు రోజులయినా దుమ్మా కొడ్తుంది. ఆమె దగ్గర కంపూట్యరు లిస్టు ఉందో, ఏమో ఒకసారి చెప్పిన కారణం మరోసారి చెప్పదు. జీతం అంటూ ఏమీ ఇవ్వను కాబట్టి అరిచే ప్రసక్తి లేదు. ఇంట్లో ఉండేది నేను ఒక్కడినే అవటాన అయిదారు ఇళ్లల్లో పనిచేసి సమయం ఉంటే మా ఇంటికి వస్తుంది. వీళ్ల నియమం ఏమిటంటే ఒకరిని తీసేస్తే మరొకరు రారు. రానీయరు. ఏది ఏమయితేనేం సునీత నాకు మంచి పని చేసింది. "వంట చేసుకోవద్దు. కచ్చితంగా తొమ్మిదిన్నరకు వచ్చి అన్నీ నేను తయారు చేస్తాను" అనేది కాని చస్తే ఆ సమయానికి వచ్చేది కాదు. మా నాన్న తన ఆస్తి నా తమ్ముళ్లకు రాసిచ్చి నాకు మటుకు ఆస్తి ఇవ్వకుండా చక్కరవ్యాధి ఇచ్చాడు. సమయానికి కడుపులో ఏదో పడాలి. ఆకలికి తట్టుకోలేను. మొదట్లో సునీత మాటలు విని నమ్మి కూర్చుని ఎంతసేపటికీ రాకపోయేసరికి వంట నేనే చేసుకోవడం మొదలెట్టాను. ఆమె నింపాదిగా మధ్యాహ్నం ఒకటి దాటాక వచ్చి, "అయ్యా, మనకోసం ఏం కూర చేసినారయ్యా!" అడిగి మిగిలింది లాగించేస్తూ, "మా ఆయనకన్నా మీరు కూరలు బాగా చేస్తారయ్యా. మా నాన్నకంటే చాలా రెట్లు నయమనుకో" అని కాంప్లిమెంట్లు విసురుతోంటే తల గోడకేసి కొట్టుకునేవాడిని. నా తలకు ఏమయ్యేది కాదు. గోడలు మటుకు బీటలు వారాయి. తనకు ఏఏ కూరలు ఇష్టమో వంటగది గోడ మీద పెన్సిలుతో రాసింది.

వంట చేసుకోడానికి నేను గిన్నెలు తోముకుంటే తప్పు పట్టి, "ఇలానా గిన్నెలు కడగడం? మా ఆయన అయితే విమ్ లేకుండా బూడిదతో ఎంత చక్కగా తోముతాడని, చూస్తే మీకే ఆశ్చర్యం వేస్తుంది. మిమ్మల్ని మా ఇంటికి ఒకసారి తీసుకెళ్తాను" అనేది. ఒకటీ రెండుసార్లు వాళ్లింటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించింది. కాని నేను వీలుపడనీయలేదు. అతనికి నన్నెక్కడ అప్రంటీస్‌గా పెడుతుందేమోనని భయం వేసింది.

ఇవేళ్టికివేళ మా ఇంటికి వచ్చి నా ఫోనులో తెగ మాట్లాడేస్తోంటే బిల్లు పెరిగిపోతుందని కడుపుమంటతో, "ఎవరితో అంతసేపుగా మాట్లాడుతున్నావు?" అడిగాను.

"మా ఆయనతో" అంది.

"మీ ఆయన ఇంట్లో లేడా?"

"ఇంట్లోనే ఉన్నాడు".

"మీ ఇల్లు దగ్గరేకదా,నా ఫోను ఉపయోగించే బదులు ఇంటికి వెళ్లాక మాట్లాడుకోవచ్చు కదా?"

"మేం పోట్లాడుకున్నాం. ఇంట్లో మాట్లాడుకోవడంలేదు" అంది.

పగుల్లు లేని గోడ నాకు కనిపించలేదు. •

